దేశం కోసం ప్రాణాలర్పించిన జాతి నాయకులకు సైతం మతాల రంగు
పులిమి, వారిని ఒకే వర్గానికి పరిమితం చేసి, మిగిలినవారిని
శత్రువులుగా చూపిస్తున్న రాజకీయాలపై అసంతృప్తి లోలోపల రగులుతోంది.
దాన్ని ఎలా కూథారూపంలోచెప్పాలి అని ఆలోచిస్తున్న క్రమంలో మా
ఊరి ఈద్గాలో కనిపించిన ఈ దృశ్యం కథకు ప్రాణం పోసింది.

వేంపల్లె షరీఫ్

# 12 సైకిల్ చక్రాలు

చారి పి.ఎస్.





రంజాన్ పండగ.

ఈద్గా వదిలారు. పిల్లలంతా బిలబిలమంటూ బయటికి ఉరికారు.

తమ్ముడు, "ఈద్ ముబారక్ భయ్యా..." అంటూ అలాయ్ బలాయ్ ఇచ్చాడు. ప్రతిగా అంతే స్వచ్ఛంగా ఈద్ ముబారక్ చెప్పి వాడి నుదుటిన ముద్దు పెట్టాను. తర్వాత తమ్ముడు అలాగే కిందికి వంగి ఇసుకలో పరిచిన జానీ నమాజ్ విదిలించి సంకలో పెట్టుకున్నాడు.

ఇద్దరం ఈద్గా మైదానం నుంచి బయటికి దారితీశాం. దార్లో కొందరు అడ్డంగా నిలబడి ఒకరికొకరు అలాయ్ బలాయ్ ఇచ్చుకుంటున్నారు. తెలిసిన ముఖమా... తెలియని ముఖమా... అని చూడటం లేదు. చేతులు చాచిన వారందరినీ ఆప్యాయంగా గుండెలకు హత్తుకుంటున్నారు. చిన్నపిల్లల సందడికైతే కొదవలేదు. తెల్లటి డ్రస్సుల్లో రంగుల టోపీలు పెట్టుకుని ఒకర్నొకరు ముబారక్ చెప్పుకుంటున్నారు. మెల్లగా కనిపించిన వాళ్లకంతా అలాయ్ బలాయ్ ఇచ్చుకుంటూ ఒక్కొక్క అడుగూ ముందుకు వేసుకుంటూ ఈద్గా గేటు దాటి బయటపడ్డాం.

బయట ఒకటే అరుపులు.

'బా... ఖైరాత్ కరోబా...' అని ఒకరు, 'అయ్యా... ధర్మం చేయి...' అని మరొకరు తోసుకుంటూ మీదిమీదికి వచ్చేస్తున్నారు.

అది ఉర్దూ గొంతా... తెలుగు గొంతా... అన్నది ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ గొంతులోని దారిద్ర్యాన్ని మాత్రమే చూస్తున్నారు. దారిద్ర్యానికి భాషాభేదం ఉండదు. అది అందర్నీ ఒకేలా చూస్తుంది. అందుకే చేయి చాచిన వారికల్లా చిల్లర పంచుకుంటూ ముందుకు కదులుతున్నారు ఈద్గా జనం. వారి వెనకాలే మేమూ నడుస్తున్నాం.

తమ్ముడు ప్యాంటు జేబులోంచి చిల్లర పొట్లం తీసి నాకు సగమిచ్చాడు. ఇది దానాల రోజు. దానం చేయాల్సిన రోజు. ఎదుటివాడి కష్టాన్ని కొంత పంచుకోవాల్సిన రోజు. ఉన్నంతలో కొంత ఇచ్చుకుని ఆ ఇచ్చుకోవడంలోని ఆనందాన్ని మనస్ఫూర్తిగా అనుభవించాల్సిన రోజు. ఆ ఆనందాన్ని పోగొట్టుకుంటే అంతకుమించిన దారిద్ర్యం లేదని బాధపడాల్సిన రోజు.

చేతిలో చిల్లర చూడగానే నాకు మా నాయన గుర్తొచ్చాడు.

'రేయ్... నాయనేడిరా...'' అన్నాను.

''ఇందాక నే నమాజ్ సదివేటప్పుడు మొదుటి ఒరుసలో కనిపిచ్చినాడే,'' అన్నాడు తమ్ముడు.

ఆయన ఈద్గాకి ముందే వచ్చేశాడు. అందుకే ఆయనకు నమాజ్ చదవడానికి మొదటి వరుసలోనే స్థలం దొరికింది. 'సైకిల్ ఉంది కదా...' అని మేము కావాలనే కొంచెం నిదానంగా వచ్చాం. వచ్చేసరికే ఈద్గా నిండిపోయింది. చేసేది లేక చివరి వరుసలోనే జానీ నమాజు పర్చుకుని ప్రార్థన పూర్తిచేసుకున్నాం. నాయన ఎప్పుడూ అంతే. ఎక్కడికెళ్లినా ఒక అడుగు ముందే ఉండాలంటాడు.

చిన్నప్పుడు కూడా ఇలాగే హడావిడి పెట్టేసేవాడు. మాకేమో బద్ధకం. మాటి మాటికి ఇంట్లోకొచ్చి, 'ఇంగా నీళ్లు పోసుకోలేదా? కొత్త గుడ్డలు కట్టుకోలేదా? ఇంగెబ్బుడు కట్టుకుంటారు? ఆడ ఊరంతా కదిలి పోతాండాది నమాజుకి,' అని తొందరపెట్టి తోలుకొచ్చేవాడు ఈద్గాకి. ఇప్పుడు 'పెద్దవాళ్లయ్యారు...' అనుకున్నాడేమో, ఎలాంటి హడావిడి లేకుండా తానొక్కడే ఎవరినీ కదిలించకుండా వచ్చేశాడు. వయసువల్ల మా మధ్య పెరిగిన దూరాన్ని తల్చుకుని బాధ కలిగింది.

నాయన కోసం అటూ ఇటూ చూశాను. ఎండ ముదురుతోంది. ఈ జనంలో నాయన్ని వెతకడం కష్టమనిపించింది. ఇంటి కెళ్లగానే నాయన కాళ్లకు మొక్కి దువా తీసుకోవాలనుకున్నాను. అడుగులు ముందుకు పడుతుంటే ఆలోచనలు కదులు తున్నాయి.

నాయన పండగొచ్చిదంటే చాలు నట్టింట్లో బండలపై చిల్లర కుప్పగా పోసేవాడు. అందులోంచి ఓ గుప్పెడు చిల్లర తమ్ముడికి, మరో గుప్పెడు చిల్లర నాకిచ్చి మిగిలింది తనదే అని తీసుకునేవాడు. ఆ చిల్లరతో ఈద్గా అంతా మాదే అనేవాళ్లం. అప్పుడింత జనం ఉండేవారు కాదు కానీ సందడి ఎక్కువ ఉండేది. ఇప్పుడు జనం ఉన్నారు కానీ సందడే తగ్గినట్టుగా ఉంది.

గాలి బుడగలు అమ్ముకునేవాళ్ల కోసం చూశాను. వాళ్లుంటే ఈద్గాకి ఒక రకమైన తిరునాళ్ల కళ వచ్చేస్తుంది. అదిగో కనిపించారు, అక్కడొక్కరు... అక్కడొక్కరు కొంచెం బీడున్న ప్రాంతంలో నిలబడి అమ్ముకుంటున్నారు. సహజంగానే వాళ్ల చుట్టూ పిల్లల గుంపు. అట్నుంచటే రంగులరాట్నాల కోసం వెతికాను. అవి కూడా ఉన్నాయి. పిల్లలు గల పెద్దలంతా రంగులరాట్నాల దగ్గరే ఉన్నారు. పుల్ల ఐస్ క్రీమ్ బండ్ల కోసం వెతుకుదామనుకున్నాను కానీ ఆ అవసరం రాలేదు. అవి అక్కడే రంగులరాట్నానికి పక్కనే ఉన్నాయి.

పూలపూల గౌన్లు వేసుకుని ఆడపిల్లలు కనిపించారు. నాకు అక్క గుర్తొచ్చింది. అక్క పెళ్లయి రాయచోటిలో అత్తగారింట్లో ఉంది. అమ్మను పంపించి ఫోన్ చేస్తే... 'పండగ ఈణ్నే జేసుకుందాం అంటాండార్రా... మీ బావ, ఈ తూరి రావడం లేదులే...' అంది. పండక్కి అక్క కూడా వచ్చి ఉంటే బావుండేదనిపించింది. ఒక్కక్షణం మనసు ఏదో వెలితితో మూలిగింది.

చిన్నప్పుడు అక్క మాతోపాటు ఈద్గాకు వచ్చేది. నాయన వద్దన్నా వచ్చేది.

''ఈ రొండు కోతుల్తోనే నాకు తలకాయ నొప్పుయితాండాది. ఇంగ నువ్వు యాడికిమ్మే వొచ్చేది, అయినా ఆడపిల్లోళ్లు ఈద్గా కాడికి వొచ్చారా... యాడన్నా...' అనేటోడు నాయన.

అక్క అలిగేది.

''పక్కింటోళ్ల ఫాతిమా, వాళ్లన్నతో కల్సి వొచ్చాండాదంటా ఈద్గాకి, నేనొచ్చే తప్పేముండాది?'' అనేది.

''అట్టయితే నువ్వు గుడక ఆ ఫాతిమా తోడ్తానే రాపో మ్మే,'' అనేవాడు నాయన.

ఫాతిమాతో తిరుగుతా అక్క ఈద్గా బయట సంతోషంగా కనపడేది. రంగుల రాట్నాలు తిరిగేది. గాలి బుడగలు కొనుక్కునేది. ముఖ్యంగా రంగురంగుల రిబ్బన్లు కట్టలు కట్టలు కొనుక్కునేది. దానికి రిబ్బన్ల పిచ్చి. నేను తమ్ముణ్నే అయినా అక్కకి ఐస్ క్రీమ్ ఇప్పించేవాణ్ని. అక్క నేను ఐస్‌క్రీమ్ తినుకుంటూ ఇంటికి నడిచేవాళ్లం. తమ్ముడు ఎప్పుడూ నాయన చేయి పట్టుకునే ఉండేవాడు.

తమ్ముడి గుర్తొచ్చి పక్కకి చూశాను. వాడు అల్లంత దూరంలో యాచకులకు చిల్లర వేయడంలో బిజీగా ఉన్నాడు. అప్పుడు కానీ నాకు గుర్తు రాలేదు... నా జేబులో కూడా చిల్లర ఉన్న సంగతి. యాచకులందరినీ గమనించాను. హైదరాబాద్ వెళ్లి

జర్నలిస్టు ఉద్యోగంలో చేరాక ఎంత లేదన్నా నా అలవాట్లు, ఆలోచనలు కొంతమేర మారాయి. అందుకే కొంచెం వయసు పైబడినవాళ్లు, బతకడానికి ఇంకే పని చేయలేని అవిటివాళ్లు ఎవరైనా ఉన్నారేమో అని మొదటి ప్రాధాన్యతగా చూశాను. నా కంటికి ఒక్కరంటే ఒక్కరు కూడా అలాంటివారు కనిపించలేదు. ఎందుకనో కాలు, చేయి బావుండి యాచిస్తున్నవాళ్లకు అంత తొందరగా చిల్లర ఇవ్వబుద్ధి కాదు. చాచిన చేతులన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కాదనుకుంటూ ముందుకు కదిలాను.

అందరికీ ఇలా లేదంటుంటే చూసినవాళ్లు ఏమనుకుంటారో అన్న అనుమానం కూడా కలిగింది.

'హైద్రాబాద్‌లో పేరుకే పెద్ద ఉద్యోగం జేచ్చాండాడు. దానం జేసే పొద్దు సేయి సాచి అడిగినోళ్లకు ఒక్కరూపాయి గుడక యియ్యకపాయబ్బా... మనిషి,' అంటారని భయం కలిగింది.

అయినా ఎవరో ఏదో అనుకుంటారని మన వ్యక్తిత్వానికి భిన్నంగా నడుచుకోవాల్సిన అవసరం లేదని నాకు నేనే మళ్లీ సర్దిచెప్పుకున్నాను. నాకు మనస్ఫూర్తిగా దానం చేయాలనిపించే వ్యక్తులు కనబడేంతవరకు అలాగే ముందుకు కదులుతున్నాను.

ఒక్క ముసలావిడ దగ్గర నా అడుగులు ఆగాయి. ఈ రద్దీకి దూరంగా ఓ మాసిపోయిన బట్టను పర్చుకుని దీనంగా కూర్చోనుందామె.

"బా... అల్లా క దిన్.. ఖైరాత్ కరో బా..." అంటోంది.

భాషను చూసి ముస్లిమేమో అనుకున్నాను కానీ బుర్ఖా లేదు. రాయలసీమలో చాలామంది ముస్లిమేతరులు అచ్చం ముస్లిముల్లాగానే ఉర్దూ మాట్లాడతారు. చుట్టరికాలు కలుపుకుని కలసిపోతారు. బహుశా ముస్లిం జనాభా ఎక్కువ ఉండటం వల్ల వారితో సత్సంబంధాల కోసం ఇక్కడివాళ్లకు అది తప్పలేదేమో. ఈ విషయంలో కోమట్లు ఒక ఆకు ఎక్కువే చదివారు.

చిన్నప్పుడు ఎప్పుడు పావలా తీసుకుని అంగిడింటికి వెళ్లినా, 'క్యాబా... క్యా హోనా..?' అని ఆప్యాయంగా పలకరించే మా ఇంటి దగ్గరున్న కోమిటమ్మ గుర్తుకొచ్చింది. ఆమె వ్యాపార నైపుణ్యం నాకెప్పుడూ అబ్బురమనిపించేది.

ఆమె కొడుకు లక్ష్మణ్ నాకు స్నేహితుడు. ఇద్దరమూ ఒకే స్కూలు కాదు కానీ ఒకే తరగతి. వాడు ఉషాకిరణ్ స్కూలు అయితే నేను గవర్నమెంటు స్కూలు. అయినా వాడు అంగిడింట్లో వచ్చిపోయే వాళ్లతో చదువుకోవడం కష్టంగా ఉందని

మా ఇంటికొచ్చి నాతో పాటు మిద్దెపైన చదువుకునేవాడు. ఇప్పుడు వాడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని మొన్న వాళ్లమ్మే కనిపించి చెప్పింది.

"బా... అల్లా క దిన్... ఖైరాత్ కరో బా..." అంత సందడిలోనూ ఆ దీనురాలి గొంతు మరోసారి చెవులకు తాకింది.

ఇందాక తమ్ముడు ఇచ్చిన చిల్లరలోంచి ఓ ఐదురూపాయలు తీసి ఆమె కిచ్చాను. ఇంకో అర్భుడికోసం వెతుకుతుంటే కనిపించిందా దృశ్యం.

ఆంజనేయుడు.

సీతను చూడ్డానికి వెళ్లి... తోకతో లంకకు నిప్పంటించి వచ్చిన ధీశాలి. ఆ పక్కనే గాంధీ మహాత్ముడు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహానుభావుడు.

మా ఊరి ఈద్గాలో వీళ్లంతా మామూలే. ఇక్కడ రంజాన్ పండుగ ఒక్క సాయిబూలదే కాదు పేదోళ్లందరిదీ. పండుగపూట ముస్లిములందరూ తెల్లటి జుబ్బాల్లో మురిసిపోతే ఇలాంటి వాళ్లంతా రకరకాల వేషాలతో రెడీ అయిపోతారు. పండగ మామూళ్ల కోసం వెంటాడుతారు. ఈద్గా జనం కూడా నవ్వుతూ వారికి తోచింది ఇచ్చి పంపిస్తారు.

ఇప్పుడక్కడ ఆ సీనే నడుస్తోంది. మా చిన్నప్పుడైతే ఇంకా ఎక్కువ వేషాలుండేవి. గంగమ్మ... గౌరమ్మలు వచ్చేవారు. ఆ బొమ్మల వంక అలా చూస్తూ నిలబడిపోయేవాళ్లం. ఒక పెద్దపళ్లెంలో గంగమ్మ, గౌరమ్మల బొమ్మల్ని పెట్టుకుని ఇద్దరు ఆడవాళ్లు వచ్చి నిలబడేవాళ్లు. ఓ చేత్తో వేపాకు మండలు పట్టుకుని, నుదుట రూపాయి బిళ్లంత పెద్దపెద్ద కుంకుమబొట్లు పెట్టుకుని ఉండేవాళ్లు. వచ్చీ పోయే వాళ్లు ఆ పళ్లెంలో చిల్లర వేసేవాళ్లు.

సుగాలీ ఆడవాళ్లయితే మరీ అల్లరి చేసేవాళ్లు. రెండు భజన చెక్కలు తీసుకుని వాయిస్తూ ఈద్గా బయట తిరిగేవాళ్లు. ఆ చెక్కలకు ఆ పక్క , ఈ పక్క సన్నటి గజ్జెలు కూడా కట్టేవాళ్లు. ఆ చప్పుడు విని మగాళ్లు దొరక్కుండా దూరంగా పారిపోవడానికి ప్రయత్నిస్తే, వదిలేవాళ్లు కాదు. ఇటు కొందరు అటు కొందరు చుట్టుముట్టి, 'ఇయ్యవయ్యా... సాయిబయ్యా...' అని దబాయించేవాళ్లు. ఇదంతా చూస్తున్న మాలాంటివాళ్లకు చాలా తమాషాగా ఉండేది.

ఇంకా అలాంటి వాతావరణం మా ఊరి ఈద్గాలో మిగిలి ఉన్నందుకు ఎక్కడలేని ఆనందం కలిగింది. దేశానికంతటికీ ఈ చిత్రాన్ని గీసి చూపించాలని పించింది.

నాకు తెలియకుండానే గాంధీవేషంలో ఉన్న పిల్లవాడి వైపుకు కళ్లప్పగిం చేశాను. చేతిలో కర్ర పట్టుకుని నిలబడున్నాడు పిల్ల గాంధీ. కట్టుకదలడం లేదు... చెక్కు చెదరడం లేదు. వొళ్లంతా సిల్వర్ పెయింటు పూసుకుని అచ్చం విగ్రహంలా ఉన్నాడు. మధ్యమధ్యలో ఎప్పుడో ఒకసారి టప్పుమని కళ్లార్పుతున్నాడు. అలా ఆర్పినప్పుడు చుట్టూ ఉన్న పిల్లలు కనిపెట్టి, 'దేఖ్... దేఖ్... కండ్లు మూసినాడు తాతా...' అంటున్నారు.

గాంధీ మహాత్ముడి కాళ్ల దగ్గర చిల్లర గుడ్డ పరిచి ఉంది. దానిపై అప్పుడొక బిళ్ల అప్పుడొక బిళ్ల చిల్లర పడుతోంది. ఒక ఈడ్గా పిల్లవాడు పది రూపాయల నోటు వేశాడు. దానిమీద కూడా గాంధీతాతే... బోసిగా నవ్వుతున్నాడు. గాంధీ ఆకారంలో ఉన్న పిల్లవాడికి గాంధీబొమ్మ ఉన్న కరెన్సీ నోటు బహుమతి. భలే... భలే...

ఈమధ్య ఆయన్ని ఒక మతానికే పరిమితం చేసి తీసిన సినిమా ఒకటి మనసులో మెదిలింది. దేశనాయకులందరికీ మతం ముద్రలేసి అందరికీ చెందాల్సిన జాతిని కొందరికే పరిమితం చేసి మిగతావాళ్లను శత్రువులుగా చూపిస్తున్న దేశ రాజకీయాలు గుర్తొచ్చి మనసంతా పాడైంది.

ఇక అక్కడ ఉండలేకపోయాను. జేబులోంచి చేతికి చిక్కినంత చిల్లర తీసి గాంధీ ముందు పరిచిన గుడ్డమీదికి మెల్లగా విసిరాను. నాణాలు ఘల్లుమని దొర్లుకుంటూ వెళ్లి పడ్డాయి.

రెండు అడుగులు ముందుకేశాను. ఆంజనేయుడు పిల్లలతో ఆడు కుంటున్నాడు. పిల్లల చుట్టూ ఆంజనేయుడు... ఆంజనేయుడి చుట్టూ పిల్లలు. ఆకట్టుకునే హావభావాలతో టోపీ పిల్లలతో దోస్తీ కట్టాడు హనుమంతుడు. ఆ రాముడి ముందు హనుమంతుడు ఎంత వినయంగా ఉంటాడో అంతే వినయంగా తల వంచి పిల్లలిచ్చిన చిల్లరను తీసుకుంటున్నాడు. ఆ దృశ్యం చూడగానే మనసు హాయిగా అనిపించింది. ఈ దేశానికి ఇక ఏ చింతా లేదనిపించింది. కానీ అంతలోనే ఉదయం బస్టాండు గోడలపై చూసిన స్లోగన్ ఒకటి గుర్తొచ్చింది.

'ఆంజనేయుడు ఆయారే... శత్రువులు పరారే...'

'ఎక్కడున్నారు శత్రువులు? ఎప్పుడొచ్చారు మా ఊరికి? వస్తే ఉంటారా? ఆంజనేయుడి దాక ఎందుకు...? అసలు వాళ్ల దృష్టిలో శత్రువులు అంటే ఎవరు? ఎవరిని ఉద్దేశించి ఇవి రాశారు? ఎందుకు పచ్చని పల్లెల్లో ఇలాంటి స్లోగన్లు రాస్తున్నారు? అనవసరంగా ఒకరి దేవుళ్లను ఒకరికి శత్రువులను చేస్తున్నారే. ఇక్కడ

దేవుళ్లు కొందరికి ఆరాధ్యులైతే మరికొందరికి ఉపాధి. ఇంకా కొందరికి వ్యాపారం. వ్యాపారస్తుల సంగతి పక్కనపెడితే దేవుళ్లను, జనాదరణ ఉన్న జాతినేతల ఆకారాలను వేషాలుగా వేసుకుని లౌకికతత్వాన్ని గుర్తుచేస్తూ, కళను బతికిస్తూ... తామూ బతుకుతున్న పేదవాళ్ల పరిస్థితి ఏంటి? ఈ కళాకారుల ఆకలికి మతం ఉందా? ఒక్కసారిగా దేశంలో ఉన్న పాత్రలన్నీ కళకు దూరమవుతున్నట్టు అనిపించింది. రకరకాల ఆలోచనలతో మనసంతా భగభగా మండిపోయింది. బొరకల టోపి తీసి నెత్తి గోక్కుని మళ్లీ పెట్టుకున్నాను.

చిల్లర పంచడం అయిపోయిందేమో, “రాన్నా... ఇంగ పోదాం...” అంటూ తమ్ముడు భుజమ్మీద చెయ్యేసేసరికి నా ఆలోచనలకు బ్రేక్ పడింది.

ఆంజనేయుడి వేషధారి చేతిలో మిగతా చిల్లరంతా పోసేసి తమ్ముణ్ని అనుసరించాను.

“సూడుబ్బీ, ఈద్గాలో ఆంజినేయుడు ఎట్టా కల్సిపోతాండాడో. ఇది ఈద్గా అని ఆ ఆంజినేయ సోమి ఆకలికి ఏమన్నా తెల్సా? ఇది ఆంజినేయ సోమి ఆకలి అని ఈద్గాలో ఉన్న జనానికి ఏమన్నా తెల్సా? యీళ్లందరికీ నిజమైన దేవుడు ఆకలే గదుబ్బీ. ఆకలి వోళ్లకైనా యీళ్లకైనా ఒక్కటే గదా, తల్సుకుంటాంటే కడుపులో అంతా బాదగా ఉండాది,” అన్నాను.

“నువ్వు హైద్రాబాద్‌కు పోయినాక బాగా పాడైపోయినావున్నా. పెతి సిన్నదానికి పెద్దగా ఊహించుకుంటాండావ్. ఆ ఆంజనేయుడి ఏషంలో ఉండింది ఎవుడు అనుకుంటాండావ్... మనతోపాటు సిన్నప్పుడు సదువుకున్న ఆ గుట్ట మీదుంటే జెర్రిపిట్టుగాడు కదూ. ఎంత బాగా సదివేటోడన్నా. వోళ్ల నాన్న సంకురాతికి ఏషాలు కట్టి పెద్దపెద్ద పద్యాలు పాడేటోడు. నీకు మతికుండాదా... వోడు ఐదో తరగతిలో ఉన్నప్పుడు వోళ్లమ్మ సచ్చిపోయింది. ఇంక ఆన్నించి ఇంట్లో వొంట వొండేటోళ్లు లేరని వోళ్ల నాయన యీణ్ని సదువు మాన్పించేసినాడు. ఉత్తప్పుడు యీడు బేల్దారు పనికి బోతాడుగానీ పండగలు వొచ్చినప్పుడు మాత్తరం, అది ఏ పండగైనా కానీలే... అట్ట రాముడి ఏషం కానీ ఇట్టా ఆంజినేయుడి ఏషం కానీ ఏచ్చాడు. పీర్ల పండగ అబ్బుడైతే ఇంగ సెప్పనలవి గాదులే మనోడి యవ్వారం.. ఏషం ఏస్కోని ఊళ్లో వాళ్లందరినీ ఆటపట్టించాంటాడు, యియన్నీ నువ్వు మర్సిపోతే ఎట్టాగన్నా...” అన్నాడు.

నేనేమీ అనలేదు.

మావాడు చెప్పినట్టు ఇవన్నీ నాకు పాతదృశ్యాలే అయినా కొత్తగా అనిపిస్తుండటం కొంత విచిత్రంగానే ఉంది. మనిషికి బయటి జ్ఞానం కొంత అబ్బినప్పుడు సొంత విషయాలు కొన్ని కొత్తగా అనిపించడం మామూలే అనుకుంటా.

ఇప్పుడీ చర్చంతా మావాడితో పెడితే వాడికేం అర్థం కాదని మౌనంగా ఉన్నాను. మరీ మౌనంగా ఉన్నా బాగోదని అంతలోకే నోరు విప్పి, ''ఔబ్బీ.. గుర్తుండాయిగానీ... ఎందుకో నాకు ఈ పొద్దు మనూరు కొత్తగా అనిపిచ్చాండాది. మనూరి మనుషులు ఎంత మంచోళ్లోగదా అనిపిచ్చాండాది. యీళ్లంతా దేశ మంతటికీ ఆదర్శం అనిపిచ్చాండాది,'' అన్నాను.

వాడికేమీ అర్థమైనట్టు లేదు.

ముఖం చిరాగ్గా పెట్టి టకాటకా చీకిచెట్టు నీడలో పెట్టిన సైకిల్ స్టాండు తీసి మట్టిరోడ్డు మీదికి తెచ్చాడు. వాడి సంకలో ఉన్న జానీ నమాజు నా చేతికిచ్చాడు. సైకిల్ వెనకాల క్యారియర్‌లో పెట్టిన చెప్పుల్ని తీసుకుని వేసుకున్నాం. తమ్ముడు సైకిల్ ఎక్కాడు కానీ ఉన్నట్టుండి దాన్నుంచి కటకటమని పెద్దగా చప్పుడు ఏదో వినిపించింది. అద్దిరిపడ్డాను.

''సైకిల్ చైను తెగిపోయినట్టుందిబ్బీ... సిన్నోడా...'' అని అరిచాను.

వాడు దాన్నేం పట్టించుకోలేదు. వాడికి ఈ చప్పుడు అలవాటే అనుకుంటాను. ''ఊరుకోన్నా... అదెందుకు తెగుతాది? నువ్వు ముందు కూచ్చో,'' అన్నాడు సైకిల్ దిగకుండానే దాన్ని మెల్లగా ముందుకు పోనిస్తూ.

''అంతేనంటావుబ్బీ...'' అంటూ నేను సైకిల్ చైను వైపు అనుమానంగా చూస్తూ వెనుక కూర్చున్నాను. అది కటకటమంటుందే కానీ బాగా పరిశీలించి చూస్తే హుందాగా రెండు చక్రాలను కలుపుతూ సైకిలును ముందుకు నెడుతోంది.

కొద్ది దూరం వెళ్లాక మళ్లీ నేనే అన్నాను.

''వొయ్యస్సార్ ఎస్టేటుకెళ్లే దారిలో గెండి ఆంజినేయసోమి దేవలం ఉండ్లా... ఆడ ఇంగా సాయిబూలు షాపులు పెట్టుకునే ఉన్నారా?''

''ఎందుకు లేరన్నా, వోళ్లకేం. ఆరామ్‌గా ఉండారు, దేవలం ముందు పూలు, టెంకాయలు అమ్ముకుంటాండారు. ఇంగ వొచ్చే నెలనేగదా శ్రావణమాసాలు, అబ్బుడుంటాది సూడు వోళ్లకు ఆదాయం... అబ్బుడు వోళ్లకొచ్చినంత దండిగా లెక్క ఇంగ యెవరికీ రాదు. ఇబ్బుడు ఈ ఈడ్గాలో ఉండే ఫకీర్లు శానామంది గెండి వారాలకు గెండి సేరుకుంటారు,'' అన్నాడు తమ్ముడు నవ్వుతూ.

ఇంకా ఊరికి చీడ పూర్తిగా పట్టనందుకు సంతోషమైంది. బస్టాండు గోడలపై స్లోగన్లుగా ఇప్పుడిప్పుడే పాకుతున్న చీడకు విరుగుడేందా? అన్న ఆలోచనలో పడ్డాను.

తర్వాత తమ్ముడే అన్నాడు.

"ఈడ ఎట్టాంటి బేదాలు ఉండవులేన్నా. నువ్వు సెప్తాండే కతలు యాడైనా సెల్లుతాయిగానీ మనోళ్ల తాన కుదరవు. అట్ట ఎవుడన్నా పుల్లలు పెట్టడానికి వొస్తే అందరం గూడబలుక్కోని తరిమికొడ్తాం," అన్నాడు.

నాకు విరుగుడు దొరికింది.

"సంతోషంరా అబ్బీ సిన్నోడా..." అన్నాను.

సైకిల్ చైను మళ్లీ కటకటమని అరిచింది కానీ ఈసారి నేనూ పట్టించుకోలేదు. ఈ చైను ఎప్పటికీ తెగదనే ధైర్యంతో మొండిగా మరింత సర్దుకుని కూర్చున్నాను.

సైకిల్ చక్రాలు ముందుకు కదులుతున్నాయి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*21 ఆగస్ట్ 2022*

✻



18 ఏప్రిల్ 1980న కడప జిల్లాలో పుట్టిన **వేంపల్లె షరీఫ్** మొదటి కథ జీపొచ్చింది 2003 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో అచ్చయ్యింది. జుమ్మా, టోపీజబ్బార్ కథాసంపుటాలు, పిల్లల కథలతో తియ్యని చదువు కథాసంపుటాన్ని ప్రచురించారు. జుమ్మా కథా సంపుటికి 2012లో కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం లభించింది. చోంగా రోటీ, కథామినార్, యువ కథాసంకలనాలకు సంపాదకత్వం వహించారు. వృత్తిరీత్యా జర్నలిస్టు.

***చిరునామా: బి-3, లతా కాజిల్, బైపాస్, తాడేపల్లి, గుంటూరు జిల్లా 522 501 ఫోన్: 96034 29366***

***shareefvempalle@gmail.com***